క్లుప్తంగా

చెలరేగిన ప్రకాశం జట్టు


ఆరు వికెట్లు తీసిన బౌలర్ ఇర్ఫాన్


ఎం.అభినవ్

ఒంగోలు: నరసరావుపేటలో జరుగుతున్న అంతర్‌జిల్లాల అండర్ 19 క్రికెట్ పోటీల్లో గుంటూరు జట్టుపై ప్రకాశం జట్టు క్రీడాకారులు చెలరేగి ఆడారు. మ్యాచ్‌లో ప్రకాశం జట్టు బౌలర్ ఇర్ఫాన్ రాణించి ఏకంగా ఆరు వికెట్లు పడగొట్టగా బ్యాట్స్‌మన్ ఎం.అభినవ్ 101 పరుగులు, సీహెచ్ పవన్ అజేయంగా 78, కె.ఆనంద్ జోసెఫ్ అజేయంగా 78 పరుగులు చేసి ప్రకాశం జట్టును విజయపథంలో నడిపించారు. ప్రతిభచాటిన క్రీడాకారులను ప్రకాశం జిల్లా క్రికెట్ అడ్‌హక్ కమిటీ సభ్యులు అభినందనలు తెలిపారు.

విద్యా వ్యవస్థలో మార్పునకు కృషి చేద్దాం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో రవి

నాగులుప్పలపాడు: విద్యా వ్యవస్థలో ప్రభుత్వం కోరుకుంటున్న మార్పులకు అనుగుణంగా మనందరం పనిచేద్దామని మండల విద్యాశాఖాధికారి టి.రవి తెలిపారు. స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో మండలంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో గురువారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో పలు అంశాలపై ఆయన చర్చించారు. జగనన్న విద్యా కానుక, నాడు–నేడు, మధ్యాహ్న భోజనం, జగనన్న గోరుముద్ద, విద్యార్థుల హాజరు, పాఠశాలల అకడమిక్ అంశాలు, సకాలంలో సిలబస్ పూర్తి చేయడం, కన్సిస్టెంట్ రిథమ్స్ యాప్, బైజూస్ ట్యాబ్‌ల వినియోగం, కెరీర్ గైడెన్స్ వంటి పలు విద్యాశాఖ అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. సమావేశంలో ఎంఈవో–2 ఈవీ రమణయ్య, ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు పంటల బీమా పరిహారం పంపిణీ

పొదిలి: వైఎస్సార్ జయంతి, రైతు దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం రైతులకు పంటల బీమా పరిహారం పంపిణీ చేయనున్నట్లు వ్యవసాయాధికారి షేక్.జైనులాబ్దిన్ పేర్కొన్నారు. దిగుబడి ఆధారిత బీమా పథకం కింద 6491.58 హెక్టార్లలో కంది పంట నష్టపోయిన 5909 మంది రైతులకు రూ.23,31,34,093, వాతావరణ ఆధారిత బీమా పథకం కింద 760.94 ఎకరాల్లో పత్తి నష్టపోయిన 315 మంది రైతులకు రూ.12,78,365 మంజూరైనట్లు వివరించారు. లబ్ధిదారుల జాబితా రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

మద్యం తాగి వాహనం నడిపిన కేసులో మూడు రోజుల జైలు

ముండ్లమూరు: మద్యం తాగి వాహనం నడిపిన కేసులో వాహనదారుడి ఐదు వేల నగదు జరిమానాతో పాటు మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్‌ఐ సంపత్‌కుమార్ తెలిపారు. మూడు రోజుల క్రితం మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. అతడిని గురువారం దర్శి కోర్టులో హాజరు పరచగా జడ్జి ఐదు వేల జరిమానాతో పాటు మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఆయన పేర్కొన్నారు.

మధ్యాహ్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

గిద్దలూరు రూరల్: సీఐటీయూ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని కోరుతూ గురువారం స్థానిక ఎమ్మార్వో కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం తమ సమస్యలు నెరవేర్చాలని, తమ న్యాయపరమైన కోర్కెలు నెరవేర్చాలని కోరారు. మధ్యాహ్న భోజన కార్మిక సంఘం నాయకులు కుమారి, ఎస్.లక్ష్మి పాల్గొన్నారు.

బీమా ఉద్యోగుల వారోత్సవాలు


నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న ఉద్యోగులు

గిద్దలూరు రూరల్: అఖిత భారత బీమా ఉద్యోగుల సంఘం 72 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా బీమా ఉద్యోగుల వారోత్సవాలను స్థానిక ఎల్‌ఐసీ కార్యాలయం ఆవరణలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రాంచ్ అధ్యక్షుడు జి.గోపినాగరాజు ఆధ్వర్యంలో మానసిక వికలాంగుల స్కూల్లోని చిన్నారులకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్‌ఐసీ ప్రజల మన్ననలు పొందిన ఏకైక సంస్థ అన్నారు. ఎల్‌ఐసీ ఉద్యోగులు కేవీ కోటేశ్వరరావు, డి.మోహన్‌రావు, ఉమేష్‌చంద్రరెడ్డి, శరత్, పాల్గొన్నారు.

సకాలంలో పనులు పూర్తి చేయాలి

- గతంలో చేసిన పనులన్నింటికీ పూర్తిస్థాయిలో బిల్లులు
- నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లతో కమిషనర్ సమీక్ష


అధికారులు, కాంట్రాక్టర్లతో సమీక్ష నిర్వహిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు సబర్బన్: నగరంలో చేస్తున్న అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలని కాంట్రాక్టర్లు, ఇంజినీరింగ్ అధికారులను నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు ఆదేశించారు. స్థానిక కమిషనర్ ఛాంబర్‌లో గురువారం కాంట్రాక్టర్లు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. తొలుత నగరంలో జరుగుతున్న పనుల పురోగతి, ఇంకా ప్రారంభం కాని పనుల విషయమై ఎంఏ కె.మాల్యాద్రి నుంచి సమాచారం రాబట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో జరుగుతున్న రోడ్లు, కాలువల నిర్మాణ పనులు, మరమ్మతులపై ప్రతి వారం సీడీఎంఏ వీడియో సమావేశంలో సమీక్షిస్తున్నారని వెల్లడించారు. కాంట్రాక్టర్లంతా వారికి వచ్చిన పనులను సకాంలో పూర్తి చేయాలన్నారు. కాంట్రాక్టర్లకు వారికి రావాల్సిన బిల్లులు మొత్తం కూడా చెల్లించామన్నారు. ప్రస్తుతం చేయనున్న పనులకు కూడా దాదాపు రూ.20 కోట్లు రావాల్సి ఉందన్నారు. ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి చొరవతో త్వరలో ఆ మొత్తం కూడా రానున్నట్లు వెల్లడించారు. ఇంజినీరింగ్ అధికారులు ప్రతి రోజు పనులను పర్యవేక్షించాలని ఆదేశించారు. నాణ్యత విషయంలో రాజీ పడేది లేదని హెచ్చరించారు. నాణ్యతా లోపం ఉన్నట్లు తేలితే అధికారులు, కాంట్రాక్టర్లపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఎంఈ కె.మాల్యాద్రి, డీఈలు రఘురాం, గణపతి, పద్మజ, ఏఈ చంద్రశేఖర్, అంజిరెడ్డి, హనుమంతు, సాయిరామ్ పాల్గొన్నారు.

మూడు బుట్టలను సద్వినియోగం చేసుకోవాలి

నగరంలో చెత్త సేకరణలో మూడు బుట్టల విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్థానికులకు ఒంగోలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు సూచించారు. కమిషనర్ గురువారం 28వ డివిజన్‌లోని గొడుగుపాలెం, కబేళాబజార్‌లలో చెత్త సేకరణను పరిశీలించారు. ఈ సందర్భంగా పానుగుపాటి వారికాలనీ సచివాలయానికి వెళ్లే దారిలో బోరును పూడ్చేశారని, దానిని పునరుద్ధరించాలని స్థానికులు కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో వెంటనే స్పందించిన కమిషనర్ బోరును వెంటనే మరమ్మతులు నిర్వహించి పునరుద్ధరించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. గొడుగుపాలెంలో మురుగు పారుదల తీరును, కాలువలను పరిశీలించారు. రానున్న వర్షాకాలంలో మురుగు సక్రమంగా పోయేలా కాలువలను శుభ్రం చేయాలన్నారు. క్లాప్ పద్ధతిలో భాగంగా మూడు బుట్టల ద్వారా చెత్తను ఆటోలకు అందించాలని సూచించారు. చెత్త సేకరణ విషయమై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో 28వ డివిజన్ అధ్యక్షుడు రాఘవ, ఇతర అధికారులు ఉన్నారు.

కత్తి చంద్రయ్య జీవితం ఆదర్శప్రాయం


మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

- కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: తొలితరం ఐఏఎస్ కత్తి చంద్రయ్య జీవితం ఆదర్శప్రాయమని కలెక్టర్ దినేష్ కుమార్ అన్నారు. స్థానిక ఎన్‌టీఆర్ కళాపరిషత్‌లో కత్తి చంద్రయ్య 99వ జయంతి కార్యక్రమం గురువారం నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి ఇతర ప్రముఖులు పాల్గొని చంద్రయ్య చిత్రపటానికి నివాళులర్పించి వారి అనుభవాలను పంచుకున్నారు. తొలితరం ఐఏఎస్‌గా పేద బడుగు బలహీన వర్గాల కష్టాలు తెలిసిన వ్యక్తిగా సేవలు అందించిన మహనీయుడని కొనియాడారు. నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు పని చేసిన ఆయన నేటి తరం ఐఏఎస్‌లకు స్ఫూర్తిగా నిలిచారన్నారు. కత్తి చంద్రయ్య విగ్రహాన్ని ఒంగోలులో ప్రతిష్ఠించాలని నిర్వాహకులకు సూచించారు. చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో ఎంతో చొరవ చూపేవారని, ఎంతో మంది కలెక్టర్లను చూసినా కత్తి చంద్రయ్య వంటి కలెక్టర్ అరుదుగా ఉంటారన్నారు. దీనిలో నాటక రచయిత కత్తి కళ్యాణ్, డాక్టర్ విజయరాఘవరావు, శ్రీపతి ప్రకాశం, బిల్లా చెన్నయ్య, మనం ప్రసన్నరాజు, చప్పిడి వెంగళరావు, విశ్రాంత తహశీల్దారు పేరయ్య తదితరులు ఆపల్గొన్నారు.

సమస్యల పరిష్కారం దిశగా పనిచేయాలి

- ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, పక్కన ఎంపీడీవో, డీటీ

మద్దిపాడు: సమస్యలను పరిష్కరించే దిశగా అధికారులు పనులు చేయాలని ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి కోరారు. గురువారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మండలంలో పలు సమస్యలు తరచూ వస్తున్నాయని, వాటిని పూర్తిస్థాయిలో నివారించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు మేలు జరిగే విధంగా పరిపాలన సాగిస్తున్నారని, ఆయన పేరు అందరూ చెప్పుకునేలా పనులు చేసి ప్రజల మన్నలు పొందాలని ఆమె కోరారు. సమావేశంలో 32 డిపార్ట్‌మెంట్ల పురోగతిపై సమీక్షించారు. విద్యుత్‌శాఖ సమీక్ష జరుగుతున్న సమయంలో గుండ్లాపల్లి ఎంపీటీసీ సభ్యురాలు పద్మకుమారి మాట్లాడుతూ తమ గ్రామంలో తరచూ విద్యుత్ సమస్యలు తలెత్తుతున్నాయని, తమ గ్రామానికి జేఎల్‌ఎం లేదని తెలిపారు. లైన్‌మెన్ కూడా లేదని ఎంపీపీకి తెలిపారు. అదే క్రమంలో పలువురు సభ్యులు, సర్పంచ్‌లు విద్యుత్ శాఖ సమస్యలను సమావేశంలో వివరించారు. అనంతరం ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ శాఖ సమీక్ష నిర్వహిస్తున్న సమయంలో సభ్యులు సమస్యలను వివరించారు. సమస్యల పరిష్కారానికి ప్రయత్నిస్తామని ఎంపీడీవో తెలిపారు. పశుసంవర్ధకశాఖ సమీక్షలో ఆ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పలు పథకాలను పశువైద్యురాలు వివరించారు. పలు శాఖల అధికారులు వారి శాఖల్లో జరిగిన అభివృద్ధి గురించి సభ్యులకు వివరించారు. సమావేశంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వరరావు సొసైటీల అధ్యక్షులు గట్టినేని అయ్యన్న, పూనాటి చిన్న అప్పారావు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్‌కు నివాళులు


చీమకుర్తిలో నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి


బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఒడా చైర్‌పర్సన్ శింగరాజుమీనా, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

నాగులుప్పలపాడు: ప్రముఖ సంఘ సంస్కర్త, భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా మండలంలో గురువారం ఘనంగా నివాళులర్పించారు. ఉప్పుగుండూరు గ్రామంలోని సామాజిక పరివర్తన్ స్థల్ వద్ద యువకులు డా.బీఆర్ అంబేడ్కర్, డా.బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాలలతో నివాళులర్పించారు. ఒమ్మెవరం గ్రామంలోని మాదిగపల్లెలో మహనీయుల విగ్రహాలకు పూలమాలలతో గ్రామ పెద్దలు నివాళులర్పించారు. కార్యక్రమంలో కొలకలూరి సురేష్, ప్రసాద్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

చీమకుర్తి మండలంలో...

చీమకుర్తి: మాజీ ఉప ప్రధాని జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా గురువారం చీమకుర్తిలోని ఆయన విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఆయన ఆశయాలను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చల్లా అంకులు, జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ చీమకుర్తి పట్టణ కన్వీనర్ క్రిష్టిపాటి శేఖరరెడ్డి, మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు బీమన వెంకట్రావు, తప్పెట బాబూరావు, పాటిబండ్ల గంగయ్య, గోపురపు చంద్ర, బడే అయ్యపరెడ్డి, మన్నం శ్రీధర్, షేక్ ఖాదర్‌బాషా, మొగిలిశెట్టి వెంకటేశ్వర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఒంగోలు: స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు ఘన నివాళి అర్పించారు. డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతిని పురస్కరించుకుని జరిగిన కార్యక్రమానికి ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ సింగరాజు మీనా వెంకట్రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాజీ ఉప ప్రధాని జగ్జీవన్‌రామ్ జీవితం నేటి తరానికి ఆదర్శమన్నారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరు స్ఫూర్తిగా తీసుకుని పేద ప్రజానీకానికి అండగా నిలవాలన్నారు. చిన్నతనం నుంచి వివక్షలను ఎదుర్కొంటూ పట్టుదలతో ఉన్నత చదువులు చదివి దేశానికి ఎనలేని సేవ చేశారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజల ఎదుగుదలే రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి తోడ్పాటునందిస్తుందని భావించి సంక్షేమ పథకాల వెల్లువ కొనసాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోలి తిరుపతిరావు, బీసీ సెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు కటారి శంకరరావులు పేర్కొన్నారు. పేద ప్రజల ఆర్థికాభివృద్ధికి , సంక్షేమానికి బాబూ జగ్జీవన్‌రామ్ చేసిన కృషి మరువలేనిదని, భావితరం ఆయన్ను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు తమ్మినేని మాధవి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, చాత్తాడ శ్రీవైష్ణవ కార్పొరేషన్ చైర్మన్ టి.మనోజ్‌కుమార్, కార్పొరేటర్లు గోపిరెడ్డి గోపాల్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు దామరాజు క్రాంతికుమార్, నాగూర్, కృష్ణ బలిజ కార్పొరేషన్ డైరెక్టర్ తిర్లిక శ్రీనివాసరావు, షేక్ మీరావలి, వల్లెపు మురళి తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలు సబర్బన్: దివంగత మాజీ ఉప ప్రధానమంత్రి బాబూ జగ్జీవ రామ్‌కు డీఆర్‌డీఏ కార్యాలయంలో పీడీ తేళ్ల రవికుమార్, సిబ్బంది నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పీడీ తేళ్ల రవికుమార్ మాట్లాడుతూ బాబూ జగ్జీవన్ రామ్ దేశానికి చేసిన సేవల గురించి వివరించారు.

ఒంగోలు: జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి కార్యక్రమం గురువారం స్థానిక బీజేపీ జిల్లా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం శ్యాంప్రసాద్ ముఖర్జీ ఘనతను గురించి బీజేపీ జిల్లా అధ్యక్షులు పీవీ శివారెడ్డి వివరించారు. కార్యక్రమలలో మాజీ జిల్లా అధ్యక్షుడు పీవీ కృష్ణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి శివాజి యాదవ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సెగ్గెం శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి బసినేపల్లి రాజశేఖర్, ఇనమనమెళ్లూరి సీతారామయ్య, పిన్నంటి తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.


శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు శివారెడ్డి


ఉప్పుగుండూరులో నివాళులర్పిస్తున్న యువకులు


జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీఆర్‌డీఏ పీడీ రవికుమార్, సిబ్బంది


ఫర్నిచర్ క్లస్టర్ ఏర్పాటు చేయాలి


పరిశ్రమల శాఖ జీఎంను సన్మానిస్తున్న విశ్వ బ్రాహ్మణ చేతివృత్తుల సంఘ నేతలు

- 90 శాతం గ్రాంట్‌తో క్లస్టర్‌ను నెలకొల్పాలి
- జిల్లా పరిశ్రమల శాఖ జీఎం శ్రీనివాసరావును కలిసి వినతి

ఒంగోలు సబర్బన్: జిల్లాలో ఫర్నిచర్ క్లస్టర్‌ను ఏర్పాటు చేయాలని జిల్లా పరిశ్రమల శాఖ జీఎం బి.శ్రీనివాసరావును కలిసి జిల్లా విశ్వబ్రాహ్మణ చేతివృత్తుల సంఘం నేతలు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం జిల్లా పరిశ్రమల కేంద్రం కార్యాలయంలో జీఎంను కలిసి సంఘ నేతలు గత వారం కలెక్టర్‌ను కలిసి ఫర్నిచర్ క్లస్టర్ ఏర్పాటు చేయాలని కోరామన్నారు. చేతి వృత్తులతో జీవనం సాగిస్తున్న విశ్వబ్రాహ్మణుల సంక్షేమం కోసం 90 శాతం గ్రాంట్‌తో ఫర్నిచర్ క్లస్టర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. కార్పెంటర్ వర్క్‌తో జీవనం సాగిస్తున్న విశ్వబ్రాహ్మణులకు అవగాహనా సదస్సులు కూడా ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా జీఎం శ్రీనివాసరావు కలెక్టర్ ఆదేశాల మేరకు ఏ విధంగా ముందుకు వెళ్లాలో ప్రభుత్వ నిర్ణయాలకు అనుగుణంగా చర్యలు చేపడతామన్నారు. అనంతరం జీఎంను శాలువాతో సన్మానించారు. పరిశ్రమల శాఖ డిప్యూటీ డైరెక్టర్ మధుసూధన్ రెడ్డి విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులకు, సభ్యులకు ఫర్నీచర్ క్లస్టర్‌కు సంబంధించి కొన్ని సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో సంఘ నాయకులు చెన్నుపల్లి శ్రీనివాసాచారి, పొన్నపల్లి బ్రహ్మానందం, ఫణిదపు సుధాకర్, గోనుగుంట బ్రహేంద్రం, యద్దనపూడి వీర బ్రహ్మాచారి, నిమ్మల సత్యం, నూతలపాటి పోతులూరయ్య తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రంగభూమి వార్షిక సంబరాలు


రంగభూమి వేడుకల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

ఒంగోలు టౌన్: జిల్లా రంగభూమి కళాకారుల సంఘం 6వ వార్షికోత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం నుంచి నగరంలో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. వేడుకలకు సంబంధించిన కరపత్రాన్ని సంఘం ప్రతినిధులు గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమాల వివరాలను సంఘం ప్రధాన కార్యదర్శి అంగలకుర్తి ప్రసాద్ వివరించారు. శుక్రవారం ఉదయం నుంచి సోలో, గ్రూపు విభాగాల్లో జానపద నృత్యపోటీలను నిర్వహించనున్నారు. శనివారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో శ్రీకారం కళాసంస్థ వీధి నాటకాల ప్రదర్శనలు జరుగుతాయి. ముగింపు రోజున వార్షిక సభ, అనంతరం పూలరంగడు హాస్యనాటకాన్ని ప్రదర్శించనున్నట్లు తెలిపారు. కళాకారులు, కళాభిమానులు విరివిగా పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో యస్కే బాబు, దేనువకొండ సుబ్బయ్య, వాక సంజీవరెడ్డి, పాండురంగనాథం, మాకా ఆంజనేయులు, సుజాత, ఎర్మియా, నారాయణ, దిగ్విజయ్, వి.ఆదం తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి బోరు ప్రారంభం

పెద్దారవీడు: మండలంలో మద్దలకట్ట ఎస్సీ కాలనీలో తాగునీటి బోరును సర్పంచ్ గుంటు గాలెమ్మ గురువారం ప్రారంభించారు. ఎస్సీ కాలనీలో తాగునీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ దృష్టికి గ్రామస్తులు తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన మంత్రి.. బోరు వేయించి మోటార్ ఏర్పాటు చేశారు.

ఘన జీవామృతంతో విలువైన పోషకాలు

ముండ్లమూరు: రైతులు తమ పొలంలో ఘన జీవామృతాన్ని వాడితే భూమిలోని విలువైన పోషకాలతో ఎక్కువ దిగుబడులు సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ ప్రభాకర్ తెలిపారు. ముండ్లమూరు ఎస్సీ కాలనీలో గురువారం ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఘనజీవామృతం తయారీపై అవగాహన కల్పించారు. స్థానికంగా దొరికే ముడి పదార్థాలతో తయారు చేసుకోవడం చేసి చూపించారు. ప్రతి రైతు తమ పొలంలో ఘన జీవామృతాన్ని వాడితే తక్కువ ఖర్చుతో ఎక్కుల దిగుబడి పొందొచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయ జిల్లా అధికారి శిరీష, సిబ్బంది యోగేశ్వరమ్మ, పేరయ్య చౌదరి, వాణి, ఐసీఆర్పీలు, రైతులు పాల్గొన్నారు.

ఏకలవ్య పాఠశాలను సందర్శించిన ఐటీడీఏ పీఓ


పనులు పరిశీలిస్తున్న ప్రాజెక్టు అధికారి

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ పాఠశాలను ఆకస్మికంగా సందర్శించిన ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రవీంద్రారెడ్డి విద్యార్థులతో మమేకమయ్యారు. ఆయన విద్యార్థుల విద్యా ప్రమాణాలపై ఆరా తీశారు. దీంతో పాటు పదో తరగతి విద్యార్థులకు విలువైన సూచనలు అందించి రాబోయే రోజుల్లో 100 శాతం ఫలితాలు వచ్చేలా సిద్ధంగా ఉండాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం, పరిశుభ్రతపై శ్రద్ధ వహించాలని ప్రిన్సిపాల్, సిబ్బందిని ఆదేశించారు. అదనపు తరగతి గదులు నిర్మిస్తున్న ప్రాంతాన్ని ప్రాజెక్టు అధికారి సందర్శించి పనుల్లో నాణ్యత పాటించి పనులు వేగవంతం చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ప్రిన్సిపాల్ శ్యామ్యూల్ జోబ్ పాల్గొన్నారు.

పశువుల సంత పునరుద్ధరణకు చర్యలు


సమావేశంలో మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ బంగారుబాబు

చీమకుర్తి: సంతనూతలపాడులోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రాంగణంలో పశువుల సంతను తిరిగి పునరుద్ధరించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు ఏఎంసీ చైర్మన్ మారెళ్ల బంగారుబాబు తెలిపారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, అధికారులతో కలిసి గురువారం కార్యాలయంలో పాలకవర్గ సమావేశం నిర్వహించారు. మార్కెట్ కమిటీకి వస్తున్న ఆదాయ వనరులపై పాలకవర్గ కమిటీ డైరెక్టర్లతో సమీక్షించారు. గత ఆర్థిక సంవత్సరం 2022–23లో టార్గెట్ రూ.4 కోట్లు కాగా, రూ.4.52 కోట్ల ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం 2023–24లో టార్గెట్ రూ.4.50 కోట్లుగా నిర్ణయించగా, గత మూడు నెలల కాలంలో రూ.80 లక్షలు వసూలు చేసినట్లు తెలిపారు. మార్కెట్ కమిటీకి ఆదాయం పెంచుకునేందుకు అవసరమైన మార్గాలు పాటించనున్నట్లు మారెళ్ల బంగారుబాబు తెలిపారు. కార్యక్రమంలో సంతనూతలపాడు సర్పంచ్ దర్శి నాగమణి, సెక్రటరీ దానమ్మ, డైరెక్టర్లు పాల్గొన్నారు.